సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 3 । మే । 2023



ఉత్సవాలకు శ్రీకారం

యాదాద్రి శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలను మంగళవారం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ప్రారంభించారు. - 8లో



చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మిర్యాలగూడలో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33°/24°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స చేయించుకున్న విప్



చికిత్స చేయించుకుంటున్న గొంగిడి సునీత

భువనగిరి: ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మంగళవారం భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. గత రెండు రోజులుగా చెవి నొప్పితో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలోని ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ జనార్దన్‌రావును కలిసేందుకు ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె చెవిని పరీక్షించిన వైద్యులు మందులు ఇచ్చారు. గొంగిడి సునీత మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన సేవలందుతున్నాయని తెలిపారు.

నల్లగొండ, యాదాద్రి జిల్లాలకు వర్ష సూచన

త్రిపురారం : నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో బుధవారం నుంచి 7వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ఆరుతడి, కూరగాయల పంటలలో వర్షపు నీరు నిలవకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మామిడి, నిమ్మ, బత్తాయి తోటల్లో రాలిన కాయలు మంచివి మార్కెట్‌కు తరలించి, పనికి రాని వాటిని వదిలివేయకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో ఉన్న స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 6 నెలల కాల పరిమితి కలిగిన టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి పాసై, 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయసు కలిగిన యువతులు ఈనెల 8న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలు, పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కూడిన హాస్టల్ సదుపాయం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగం కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 91339 08000, 91339 08111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అర్హులకు ఉద్యోగాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జనవరి 5, 6వ తేదీల్లో నిర్వహించిన బాజాభజంత్రీ కళాకారుల పోస్టుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని, అర్హత కలిగిన వారిని గుర్తించి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర మంగళవాయిద్య కళాకారుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం ఈఓ గీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇంటర్వ్యూ చేసిన వారిలో ఇద్దరు వారి బంధువులకు, తెలిసిన వ్యక్తులకు ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. పలువురి కళాకారుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు ఆడియో రికార్డింగ్ ద్వారా సంఘానికి తెలిసిందని ఈఓకు వెల్లడించారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్

తుర్కపల్లి: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కర్రె ఉపేందర్ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆర్గనైజేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజేష్ కుమార్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు.

పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ధనుంజయ్య

భువనగిరిటౌన్: పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరందాసు ధనుంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పద్మశాలీ ఎన్నికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గోశిక యాదగిరి, అప్పం శ్రీనివాస్‌రావు, బింగి భిక్షపతి, చుంచు నాగభూషణం, రాపోలు వీరమోహన్, కర్రం వెంకటేష్, తడక వెంకటేష్, నర్సింహ పాల్గొన్నారు.

లోతట్టు కష్టాలు!

- పలు చోట్ల పల్లపు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- అకాల వర్షాలకు వరదలో కొట్టుకుపోతున్న వడ్లు
- వసతుల కల్పనలో విఫలమవుతున్న అధికారులు
- ప్రతిఏటా నష్టపోతున్న రైతులు



ఈ ఫొటోలోని రైతు గుండాల గ్రామానికి చెందిన చిరబోయిన కొమురయ్య. ఈయన తనకున్న 6ఎకరాల్లో వరి సాగు చేశాడు. గుండాల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మకానికి తెచ్చి బండమీద ఆరబెట్టాడు. అకాల వర్షంతో సుమారు 45 క్వింటాళ్ల ధాన్యం చెరువు, చెట్లపొదల మధ్యలోకి కొట్టుకుపోయింది. మరో 40 క్వింటాళ్ల ధాన్యం అమ్మకానికి ఉంది. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్లే వడ్లు కొట్టుకుపోయాయని వాపోతున్నాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.



గుండాల మండలం అంబాల ఐకేపీ సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు



గుండాల మండలం మాసాన్‌పల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు

సాక్షి, యాదాద్రి: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం రైతులకు శాపంగా మారింది. ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారుల తీరులో మార్పు రావడం లేదు. పల్లపు ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరి ధాన్యానికి నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో ఏటా ఏప్రిల్ రెండో వారం నుంచి అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ధాన్యం తడవడం, కొట్టుకుపోవడం జరుగుతుంది. అధికారులు కనీస జాగ్రత్తలు పాటించకుండా పల్లపు ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడంతో అన్నదాతకు తీరని కష్టాలు తెచ్చి పెడుతోంది.

50కి పైగా కేంద్రాలు పల్లపు ప్రాంతాల్లో..

జిల్లా వ్యాప్తంగా ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. కానీ వాటిని సురక్షితమైన స్థలాల్లో ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం 324 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే మెజార్టీ కేంద్రాలు పల్లపు ప్రాంతాలు, రాతిబండలపై, కాలువల వెంట ఏర్పాటు చేశారు. కానీ సుమారు 50కి పైగా కేంద్రాలు లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో వర్షం కురవగానే ధాన్యం నీటిలో కొట్టుకుపోయి చెరువులు, కాలువలు, చెట్లపొదల్లోకి చేరుతుంది. పోయిన ధాన్యాన్ని తిరిగి తెచ్చుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతుల చేరువలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే క్రమంలో ఎత్తయిన ప్రాంతాలు ఎంపిక చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఖాళీ స్థలం చూపి వదిలేస్తున్నారు

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించిన వెంటనే అధికారులు ఆగమేఘాల మీద సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత సీజన్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం కొంటామని చెప్పడంతో రైతులు రాశులుగా పోసి కొనుగోలు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. వర్షం వస్తే ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్లు ఉండవు. దీంతో రైతుల కళ్లముందే ధాన్యం వర్షంలో తడిసి కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంటుంది.

ప్రతి యాసంగిలోనూ ఇదే పరిస్థితి..

గడిచిన 15 సంవత్సరాలుగా యాసంగి సీజన్‌లో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దవుతోంది. కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ కమిటీలు మాత్రం కనీస వసతులు కల్పించడం లేదు. ధాన్యం కొనుగోలు చేయడం ద్వారా ఆదాయాన్ని పొందుతున్న సహకార, మార్కెటింగ్, ఐకేపీ శాఖలు రైతుల ధాన్యం రక్షణకు కనీసం రైతుల పక్షాన చర్యలు చేపట్టడం లేదు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసే సమయంలో అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

విద్యార్థులకు సహకారమందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



తొలిమెట్టు కమ్యూనిటీ వలంటీర్లతో కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్: కమ్యూనిటీ వలంటీర్లు వచ్చే విద్యా సంవత్సరంలోనూ ప్రతి శనివారం పాఠశాలలకు వెళ్లి తెలుగు, గణితంలో వెనుకబడిన విద్యార్థులకు సహకారం అందించి, ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తొలిమెట్టు కమ్యూనిటీ వలంటీర్లు హైదరాబాద్‌లో సర్టిఫికెట్స్ ప్రదానోత్సవ కార్యక్రమానికి తరలివెళ్తుండగా.. జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మే మొదటి వారం నుంచి నిర్వహించే వేసవి శిబిరంలో పాల్గొని వివిధ కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం డిసెంబర్ మాసంలో జిల్లాలో 60 మంది బీఈడీ, డిగ్రీ విద్యార్థులు వలంటరీలుగా ముందుకు వచ్చి ప్రాథమిక పాఠశాల్లోని తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతుగా ప్రతి శనివారం పాఠశాలలకు వెళ్లి తెలుగు, గణితంలో వెనకబడిన ఉన్న పిల్లలకు సహకారం అందించడం జరిగిందని పేర్కొన్నారు. కమ్యూనిటీ వలంటీర్స్ ద్వారా 60 పాఠశాలల్లో దాదాపు 1,500 మంది పిల్లలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడాల అధికారి ధనుంజయ్, సెక్టోరియల్ అధికారి అండాలు, తొలిమెట్టు కమ్యూనిటీ మూమెంట్ జిల్లా కో ఆర్డినేటర్ సరగడ కరుణ్ తదితరులు ఉన్నారు.

గడువు పొడిగింపు

సాక్షి,యాదాద్రి: జీఓ నంబర్ 58, 59 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు సమర్పించేందుకు ప్రభుత్వం మే 2 వరకు అవకాశం ఇవ్వగా.. తాజాగా మరో నెలరోజులు మే 31 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 జూన్ 2 కటాఫ్ తేదీ ఉండగా దానిని 2020 జూన్ 2కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 17 తేదీన జీఓ 29ను జారీ చేసి, నూతనంగా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. 2020 జూన్ 2 నాటికి ప్రభుత్వ స్థలాలో నివాస గృహాలు, నివాసేతర కట్టడాలు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, అందుకు సంబంధిత ఆధారాలతో మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

‘పీపుల్స్ మార్చ్’ను జయప్రదం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



భూదాన్‌పోచంపల్లిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరి నియోజకవర్గంలో బుధవారం సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చేపట్టే పీపుల్స్ మార్చ్ పాదయాత్రను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పట్టణంలో పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు యాదగిరిగుట్ట నుంచి పాదయాత్ర ప్రారంభమై పాతగుట్ట, గొల్లగుడిసెలు, దాతరుపల్లి, గ్రామాల మీదుగా భువనగిరి నియోజకవర్గం బస్వాపురం గ్రామానికి చేరుకుంటుందని తెలిపారు. బస్వాపురం రిజర్వాయర్ వద్ద నిర్వాసితులను కలిసి వారితో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అక్కడి నుంచి బస్వాపురం గ్రామానికి చేరకుని గ్రామంలో రాత్రి కార్నల్ మీటింగ్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

5, 6వ తేదీల్లో పోచంపల్లి మండలంలో..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలంలో 5, 6వ తేదీల్లో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చేపట్టే పీపుల్స్ మార్చ్ పాదయాత్రను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 5న పెద్దరావులపల్లి, గౌస్‌కొండ, రేవనపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర పోచంపల్లి పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో మూసీ, రైతుల సమస్యలను తెలుసుకుంటారన్నారు. 6న పట్టణ కేంద్రంలో చేనేత కార్మికులతో ప్రత్యేక సమావేశం ఉంటుందని, ఈసందర్భంగా చేనేత సమస్యలు, దోతిగూడెం రసాయన కంపెనీల కాలుష్యం తదితర సమస్యలను తెలుసుకుంటారన్నారు. జలాల్‌పురం గ్రామం మీదుగా జిల్లాలో పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లపై నజర్

- ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలు
- ఆదాయం పెంచే దిశగా అధికారుల యత్నం
- ఆరు మున్సిపాలిటీల్లో 2,171 వాణిజ్య సముదాయాలు



సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

భువనగిరిటౌన్: మున్సిపల్ శాఖ ఆదాయం పెంచేందుకు ముమ్మరంగా ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ స్కీంలు తేవడంతో పాటు, వివిధ రూపాల్లో పన్ను వసూళ్లు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు ఆస్తి పన్నుపై ఐదు శాతం రాయితీతో మున్సిపల్ అధికారులు ఇంటింటికి తిరిగి వసూలు చేశారు. ఈ నెల 30న దీని గడువు ముగియడంతో ప్రస్తుతం ట్రేడ్ లైసెన్స్ పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈమేరకు బుధవారం నుంచి మున్సిపాలిటీలో కేటాయించిన ఆయా వార్డుల్లో పర్యటించనున్నారు. 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో 2,171 వాణిజ్య సముదాయాలకు లైసెన్సులు మంజూరు చేశారు. ఇందుకు గాను ప్రభుత్వానికి రూ. 2కోట్ల 33లక్షల ఆదాయం రానుంది. నూతన లైసెన్స్ జారీ చేసే ఆదాయానికి అదనంగా జమ అవుతుంది.

అగ్రస్థానంలో భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు..

ట్రేడ్ లైసెన్స్ ఫీజులో భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు రాష్ట్రంలోనే టాప్‌లో ఉన్నాయి. భువనగిరి మున్సిపాలిటీకి సంబంధించి 1,101 వాణిజ్య సముదాయాలకు రూ.కోటి 10 లక్షలు, చౌటుప్పల్ మున్సిపాలిటీలో 373 వాణిజ్య సముదాయాలకు రూ.కోటి 5లక్షలు సాధించి రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నాయి.

నాలుగు మున్సిపాలిటీల్లో ఇలా

ఆలేరులో 115 సముదాయాలకు రూ. 3లక్షల 28వేలు, మోత్కూర్ 181 వాణిజ్య సముదాయాలకు రూ.4లక్షల 22వేలు, పోచంపల్లి మున్సిపాలిటీకి సంబంధించి 94 వాణిజ్య సముదాయాలకు రూ.6లక్షల 7వేలు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి సంబంధించి 907 వాణిజ్య సముదాయాలకు రూ.3లక్షల 59 వేల ఆదాయం రానుంది.

పకడ్బందీగా వసూలు చేయాలి

“భువనగిరి మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ ఫీజు వసూలు చేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. వాణిజ్య వ్యాపార సంస్థల వారందరు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవడానికి మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేయడం జరిగింది. సకాలంలో పన్నులు చెల్లించని వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు 50 మాత్రమే రెన్యూవల్ చేసుకున్నారు. మిగతావి చేసేందుకు ప్రత్యేక 18 మందితో 6 టీంలను ఏర్పాటు చేశాం. మే 30 వరకు వసూళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

- అప్పుడు అందరికీ ఇళ్లు వస్తాయి
- ఆలేరును సస్యశ్యామలం చేస్తాం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల్లో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



యాదగిరిగుట్ట పట్టణంలో పాదయాత్ర చేస్తున్న భట్టివిక్రమార్క, కాంగ్రెస్ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్, రాజాపేట: రాష్ట్రంలో త్వరలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం యాదగిరిగుట్ట మండలంలో కొనసాగింది. గౌరాయపల్లి, మాసాయిపేట, సైదాపురం మీదుగా యాదగిరిగుట్టకు చేరింది. భట్టివిక్రమార్క గౌరాయపల్లి నుంచి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్రను సాగించారు. గ్రామ శివారులో మామిడి పండ్లు అమ్ముకుంటున్న స్వప్న అనే మహిళ తమకు ఇల్లు రాలేదని భట్టితో చెప్పుకుంది. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అని తప్పకుండా ఇళ్లు వస్తాయని భట్టి భరోసా ఇచ్చారు. ఆ తర్వాత మాసాయిపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌లో రైతులతో మాట్లాడారు. ధాన్యం తీసుకవచ్చి పది రోజులు అవుతోందని, వర్షంతో ధాన్యం తడిసిందని, ఈ ధాన్యాన్ని ప్రభుత్వం తీసుకోవడం లేదని, తరుగు తీసేస్తున్నారని రైతులు మల్లయ్య, ఇప్ప రాజయ్యలు భట్టి దృష్టికి తెచ్చారు. రైతులు అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆ తరువాత మాసాయిపేటలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు.. దేవాదుల నుంచి తపాసుపల్లి డ్యామ్‌కు గోదావరి జలాలు రావాలని గతంలో ఉద్యమాలు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక తపాసుపల్లి నీళ్లను ఆలేరు ప్రాంతానికి కాకుండా, వేరే చోటుకు తరలించుకుపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గంధమల్ల రిజర్వాయర్ నింపి, ఆలేరును సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎంపీపీ చీర శ్రీశైలం, కానుగు బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.



మాసాయిపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో పారతో ధాన్యాన్ని ఆరబెడుతున్న సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

చేనేతకార్మికుల సమస్యలు తెలుసుకున్న భట్టి

భట్టివిక్రమార్క అంతకుముందు రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో చేనేత కార్మికులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నేత కార్మికులను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ఆదుకుందని విద్యుత్‌పై సబ్సిడీ అందించిందని నేత కార్మికుడు ఆడెం శివ భట్టితో చెప్పాడు. చేనేత ముడిసరుకుపై, వస్త్రాలపై రెండువిధాల జీఎస్టీ విధించడంతో చేనేత పరిశ్రమ ఆర్థికంగా చితికిపోతోందని చెప్పాడు. ఇందుకు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతృత్వంలో చేనేత కార్మికుల సంక్షేమానికి అవసరమయ్యే నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

కొండపైకి ఆటోలను పునరుద్ధరిస్తాం..



యాదగిరిగుట్టలో ఆటోకార్మికులు, స్థానికులతో మాట్లాడుతున్న భట్టివిక్రమార్క

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఖరీదైన ప్రజల కోసం యాదాద్రిగా సీఎం కేసీఆర్ మార్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేవాలయం అభివృద్ధి జరిగితే పేద ప్రజలకు మంచి జరుగుతుందని భావించారని, కానీ నేడు పేదల భూములు పోవడంతో పాటు కొండపైకి ఉపాధి కోసం ఆటోలు నడుపుతున్న కార్మికులను కొండపైకి ఎక్కకుండా చేశారని, రోడ్డు విస్తరణ పేరులో దుకాణాలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు కొండపైన భక్తులు ఒకటి, రెండు రోజులు నిద్రచేసేలా గదులు ఉండేవని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొండపై భక్తులు నిద్ర చేసేలా గదులను నిర్మాణం చేస్తామని, ఆటోలను కొండపైకి పునరుద్ధరించి కార్మికులను ఆదుకుంటామన్నారు. పట్టణంలో వేసిన బ్రిడ్జిని తొలగించి దుకాణదారులకు, చిరు వ్యాపారులకు ఉపాధి కలిగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మళ్లీ తుపాకీ వేసుకుంటేనే దారికొస్తారు...

ప్రజ స్వామ్యంపై నమ్మకం పోయిందని, మళ్లీ తుపాకీ వేసుకొని అడవులకు వెళ్తే దొరలు దారికి వస్తారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి అన్నారు. ఆనాడు నక్సలైట్లు ఉన్నారు కాబట్టి దొరలు గడీల్లో జాగ్రత్తగా ఉన్నారని, కానీ నేడు నక్సలైట్లు అంతరించారని, నక్సలిజం పక్కకు పోయిందని దొరల గడీలు మళ్లీ పునఃనిర్మాణం అయ్యాయన్నారు. అవసరమైతే తెలంగాణలో ఆత్మగౌరవం కోసం మరొక ఉద్యమానికి సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అంతకు ముందు యాదగిరిపల్లి నుంచి యాదగిరిగుట్ట పట్టణం వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, టీపీసీసీ సభ్యులు సంజీవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నాయకులు బందారపు బిక్షపతి, జీవన్‌రెడ్డి, కలకుంట్ల బాలనర్సయ్యగౌడ్, ఎనగందుల సుధాకర్, గుండు నర్సింహగౌడ్, మల్లేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈలో సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

నల్లగొండ : జాతీయ స్థాయి ఐఐటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని జిల్లా మహాత్మా జ్యోతి బాపూలే గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ ఎం. షకీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలకు చెందిన 22మంది విద్యార్థులు సత్తా చాటి జేఈఈ అడ్వాన్సుకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ బాలుర కళాశాల నుంచి 6 మంది విద్యార్థులు, నార్కట్‌పల్లి మూసీ ప్రాజెక్ట్ జూనియర్ బాలుర కళాశాల నుంచి నలుగురు, దేవరకొండ కొల్లి ముంతలపహాడ్ బాలుర కళాశాల నుంచి నలుగురు, మిర్యాలగూడ తుమ్మడం – దామరచర్ల బాలికల కళాశాల నుంచి 6గురు అర్హత సాధించగా మునుగోడు బాలికల కళాశాల 1, కోదాడ అనంతగిరి బాలికల కళాశాల నుంచి ఒకరు అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులకు వారి లక్ష్య సాధనలో కృషి చేసిన ఆయా కళాశాలల అధ్యాపకులను రీజినల్ కోఆర్డినేటర్ షకీనా అభినందించారు.

లక్కీ లాటరీ పేరిట టోకరా

మునుగోడు: లక్కీ లాటరీ పేరిట ఇద్దరు యువకులు ప్రజలకు టోకరా ఇచ్చారు. ఈ ఘటన మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు బహిరంగంగా పలు వస్తువులని పెట్టి వాటికి నంబర్లు వేశారు. ఆ నంబర్లతో కొన్ని చిట్టీలని వేసి ఎవరైనా రూ.వెయ్యి నుంచి రూ. 1500లు పెట్టి చిట్టీ తీసుకోవాలి. ఆ చీటీలో వస్తువు నంబర్ వస్తే రెండింతలు, మూడు ఇంతల డబ్బులు ఇస్తామని ఆశ చూపారు. దీంతో కొందరు అత్యాశతో చిట్టీలు కొనుగోలు చేయగా మొదట ముగ్గురు, నల్గురికి ఆ వస్తువుల నంబర్ రావడంతో డబ్బులు ఇచ్చారు. దీంతో అనేక మంది చిట్టీలు తీసుకోగా అధిక మందికి రాలేదు. ముందు ఒక్కరు ఇద్దరికి మాత్రమే ఇచ్చి తర్వాత ఏ ఒక్కరికీ ఇవ్వకుండా దాదాపు రూ. 20 నుంచి రూ.30వేల వరకు కాజేసి అక్కడి నుంచి టీకానా మార్చేశాడు. ఇలా మండల వ్యాప్తంగా రోజు ఒక గ్రామంలో కొనసాగిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.

అధ్యాపకుడికి అంబేడ్కర్ పురస్కారం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న దిశ గ్రామీణాభివృద్ధి సేవా సంస్థ ప్రతినిధులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆంగ్ల అధ్యాపకులు చింత శ్యాంసుదర్‌కు అంబేడ్కర్ జయంతి పురస్కారం ఇటీవల అందజేయడంతో మంగళవారం యూనివర్సిటీలో పలువురు ఆయనను అభినందించారు. వివిధ సేవా కార్యక్రమాలకు గాను పురస్కారం దిశ గ్రామీణ అభివృద్ధి సేవా సంస్థ అందించడం పట్ల హర్షం ప్రకటించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

అడ్డగూడూరు : షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బీజేపీ మండల అధ్యక్షుడు కడియం సోమన్న తన స్కార్పియోలో మోత్కూరు నుంచి అడ్డగూడూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో మండల కేంద్రం శివారులోకి రాగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన సోమన్న కారు ఆపి దిగడంతో ప్రమాదం తప్పింది. చూస్తుండగా మంటలు అంటుకుని కారు పూర్తిగా దగ్ధమైంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 33.5 తులాల బంగారు, 2కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

మిర్యాలగూడ అర్బన్: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టి జిల్లా ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన బత్తుల సాయి కిరణ్ అలియాస్ సాయి కొంత కాలంగా మిర్యాలగూడ రైస్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తూ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మిల్లులో పనిచేస్తూనే పట్టణంలోని తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో ఇనుపరాడ్డు సహాయంతో చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని ఈదులగూడ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేయగా చోరీలకు పాల్పడిన విషయాన్ని అంగీకరించాడు. దీంతో అతడు పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో పాల్పడిన 11 దొంగతనాలలో మొత్తం 23లక్షల రూపాయల విలువైన 33.5 తులాల బంగారు ఆభరణాలు, 2కిలోల వెండితో పాటు పల్సర్ బైక్, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. దీంతో అతడిని అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కాగా కేసును ఛేదించిన డీఎస్పీ వెంకటగిరి, సీఐ రాఘవేందర్, ఎస్‌ఐలు శ్రీనునాయక్, కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు నాగరాజు, ఎస్.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మండవ సైదులును ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. సమావేశంలో టూటౌన్ సీఐ నరసింహారావు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

కోదాడరూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. కోదాడ, కొండమల్లేపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు...కోదాడ పట్టణంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఎస్‌కె.మీరాసాహెబ్, ఎస్‌కె.సైదులు బైక్‌పై కాపుగల్లు నుంచి కోదాడ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో పెన్‌పహాడ్ మండలం తంగెళ్లగూడేనికి చెందిన మేకల ఉప్పలయ్య, లక్ష్మమ్మలు బైక్‌పై కోదాడ నుంచి కాపుగల్లు వైపు వెళ్తుండగా రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఉప్పలయ్య, మీరాకు తీవ్ర సైదులుకు స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

కొండమల్లేపల్లి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. చిన్న అడిశర్లపల్లి గ్రామానికి చెందిన కంచర్ల బలరాంరెడ్డి బైక్‌పై పెండ్లిపాకల నుంచి బైక్‌పై రోడ్డుదాటుతున్నాడు. ఈ అంగడిపేట నుంచి బైక్‌పై వస్తున్న బొడ్డు అంజయ్య కుమారుడు అభిషేక్, పగిళ్ల అనిల్‌తో కలిసి వస్తూ పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు వద్ద బలరాంరెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదలో బలరాంరెడ్డి కాలుకు తీవ్ర గాయం కాగా బొడ్డు అంజయ్య, పగిళ్ల అనీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

కోతుల దాడిలో..

దేవరకొండ: కోతుల దాడిలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. దేవరకొండ మండల పరిధిలోని తూర్పుపల్లి గ్రామానికి చెందిన పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నూనె సురేష్ రిజిస్టర్ పోస్టు చేసేందుకు పట్టణంలోని పోస్టాఫీస్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా సురేష్‌పై దాడి చేసి వీపు మీద గాయపర్చాయి. అనంతరం సురేష్ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కోతుల బెడదను నివారించాలని స్థానికులు కోరారు.

మీడియా చానల్‌పై కేసు

చిట్యాల: నియోజకవర్గంలో దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై అసత్య కథనాలు ప్రసారం చేసిన ఓ మీడియా చానల్, స్టాఫ్ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నకిరేకంటి ధర్మా మంగళవారం తెలిపారు. చిట్యాల మండలం వెంబావి గ్రామంలోని దళిత బంధు పథకం లబ్ధిదారులు బోగరి నర్సింహ, ప్రసాద్, మహేష్, కృష్ణ, యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హైవేపై రెండు లారీల ఢీ



హైవేపై ఢీకొన్న లారీలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి హైవేపై రెండు లారీలు ఢీకొన్నాయి. పోలీసులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన లారీ డ్రైవర్ ఉబ్బని రవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొక్కజొన్న లోడుతో మేడ్చల్ జిల్లా నూతనకల్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో వలిగొండ వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ హైదరాబాద్ వైపు వెళ్లేందుకు హైవే క్రాస్ చేస్తుంది. ఈ క్రమంలో ఇసుక లారీ వేగంగా వెళ్లి ముందున్న లారీని ఢీకొట్టింది. లారీలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో హైదరాబాద్ మార్గంలో సుమారు 2గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాహనాలను సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ప్ర మాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలవ్వలేదు. మొక్కజొన్న లోడు లారీ యజమాని అమిరెడ్డి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై సైదులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. పెద్దఅడిశర్లపల్లి, చిట్యాల మండలాల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 25 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం రాత్రి పీఏపల్లి మండలంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఘనపురం స్టేజి సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



నర్సింహ (ఫైల్)

రోడ్డు దాటబోయి..

చిట్యాల: చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేసే గుండె నర్సింహ(55) మంగళవారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలోని అండర్‌బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహకుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కిడినుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



పాలకవీడు మండలం శూన్యంపహాడ్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

పాలకవీడు: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని శూన్యంపహాడ్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. శూన్యంపహాడ్–దామరచర్ల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ధాన్యం నాసిరకంగా ఉందంటూ అధికారులు, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు వాపోయారు. ఒక్కపక్క అకాల వర్షాలు, రాత్రి సమయాల్లో కాపలాతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పౌరసరఫరాల శాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని కోరారు. ధాన్యంలో తాలు శాతం ఎక్కువగా ఉండడంతో మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని, క్వింటాకు కేజీ నుంచి రెండు కేజీల వరకు తరుగు తీస్తున్నారని అన్నారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై సైదులు రైతుల వద్దకు వచ్చి సంప్రదింపులు జరిపారు. నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసి ధాన్యాన్ని తరలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



ఎల్లమ్మ మృతదేహం

చింతపల్లి : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాడెం ఎల్లమ్మ(35) ఇంటి ప్రహరీకి నీళ్లు కొట్టే సమయంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎల్లమ్మ భర్త వెంకటయ్య ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అత్త, మామలు కూడా గతంలోనే మృతిచెందారు. దీంతో ఎల్లమ్మ కుమార్తె పావని, కుమారుడు బన్నీతో కలిసి గ్రామంలో ఉంటుంది. తల్లి కూడా మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. మృతదేహం వద్ద చిన్నారులు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

స్వస్తి వాచనంతో ఉత్సవాలకు శ్రీకారం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు



గరుడ వాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

- యాదాద్రిలో లక్ష కుంకుమార్చన
- ఉదయం తిరు వేంకటపతి అలంకార సేవ
- రాత్రి పరవాసుదేవ అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు



ఆలయ మాఢ వీధిలో తిరువేంకటపతి అలంకార సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు ఆధ్వర్యంలో మంగళవారం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ప్రారంభించారు. ఉదయం 9.30గంటలకు ఆలయంలో స్వస్తివాచనంతో జయంతి ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వక్సేన ఆరాధన గావించి, పుణ్యాహవాచనం వేడుకలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వయంభూలకు కంకణాధారణ చేసిన అనంతరం మిగతా పూజాది కార్యక్రమాలు చేపట్టారు.

లక్ష కుంకుమార్చన.. అలంకార సేవ..

జయంతి ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి నృసింహ స్వామి వారికి ముఖ మండపంలో లక్ష కుంకుమార్చన పూజలు జరిపించారు. ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, వేద పండితులు, పారాయణికుల వేద మంత్రాలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం తిరువేంకటపతి అలంకార సేవలో స్వామి వారిని అలంకరించి తిరు, మాఢవీధుల్లో భాజాభజంత్రీలు, సన్నాయి మేళాలతో ఊరేగించారు. కలియుగ ప్రత్యక్షదైవమైన తిరు వేంకటపతి అలంకార సేవలో భక్తకోటిని భగవానుడు అనుగ్రహించుట ఎంతో విశేషమని ఆచార్యులు ఈ సందర్భంగా వెల్లడించారు.

సాయంత్రం వేళ..

జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి ప్రధానాలయంలో సాయంత్రం సమయంలో నిత్య సామూహిక పారాయణముల అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య అంకురారోపణం, హవనం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరణ చేసి గరుడ వాహనంపై ఊరేగించారు. ఆయా వేడుకల్లో డో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతగుట్టలో..

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సైతం స్వామి వారి జయంతి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం స్వస్తివాచనం, విశ్వక్సేన ఆరాధన, రక్షా బంధనం, లక్ష కుంకుమార్చన జరిపించారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ, హవనం నిర్వహించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామి వారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రధానాలయంలో సాంస్కృతిక ఉత్సవాలను అధికారులు ప్రారంభించారు. మల్లాపురం వారిచే శ్రీరామ భక్తి భజన, గాయత్రి మహిళ భజన మండలి యాదగిరిగుట్ట వారిచే భజన నిర్వహించారు. సాయంత్రం భావనాలయ నృత్యాలయం, నటరాజ డ్యాన్స్ స్కూల్, శ్రావ్య బండారి బృందం, యాదాద్రి కూచిపూడి కళాశాల, హరీష్ డ్యాన్స్ అకాడమీ, సాంస్కృతిక విశ్వ కళా మండలిలచే కూచిపూడి నృత్యాల ప్రదర్శన నిర్వహించారు.

నిరుద్యోగ అభ్యర్థులకు 'నల్లగొండ యువతరం'

- గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేసే వివిధ ఉద్యోగాలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థుల కోసం గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'నల్లగొండ యువతరం' యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు ట్రస్ట్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 నుంచి 60 రోజుల పాటు ఎస్‌ఐ, కానిస్టేబుల్, గ్రూప్–4 అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాలతో పట్టణంలో నివాసం ఉండలేని గ్రామీణ అభ్యర్థుల కోరిక మేరకు నల్లగొండ యువతరం యాప్ రూపొందించినట్లు తెలిపారు. దీనిని ఈనెల 7వ తేదీన టీఎస్‌జీటీస్ భవన్‌లో లాంచ్ చేస్తామని తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థుల కోసం మరో రెండు నెలల పాటు టీఎస్‌జీటీస్ భవన్‌లో ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. సమావేశంలో మునాసు వెంకన్న, మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్‌సుందర్, వనమా వెంకటేశ్వర్లు, హన్ను, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

జూదరుడి అరెస్ట్

కోదాడరూరల్ : పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఓ జూదరుడిని అరెస్ట్ చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దోరకుంట శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. గమనించిన నలుగురిలో ముగ్గురు పరారు కాగా ఒకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఆర్టీసీ ఉద్యోగి మృతి



విజయలక్ష్మి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ ఉద్యోగిని మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న బుసిరెడ్డి విజయలక్ష్మి (45) తన కుమారుడిని బెదిరించేందుకు ఏప్రిల్ 27న మజ్జిగలో ఎలుకల మందు కలుపుకుని తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు. విజయలక్ష్మి మృతదేహాన్ని డిపో మేనేజర్ పాల్, ఇతర ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.

మామిడి కోతలో జాగ్రత్తలు తప్పనిసరి

- కాయలపై సొన కారకుండా చూడాలి
- ఉదయం 10 గంటలలోపే కాయలను కోయాలి
- ఉద్యానవన శాఖ అనుముల క్లస్టర్ అధికారి మురళి



మామిడి చెట్టు

పాడి పంట

పెద్దవూర: ఈ యేడాది వాతావరణ మార్పులతో మామిడిలో దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. మామిడి కాయలు ఇప్పుడిప్పుడే పక్వానికి వస్తున్నాయి. కోతలు కూడా మొదలవుతున్నాయి. అయితే చేతికందిన కాయలు, పండ్లను సరైన పద్ధతుల్లో నిల్వ, రవాణా చేస్తేనే ఎంతో కొంత లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో మామిడి కోతతో పాటు నిల్వ, రవాణా చేసే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మామిడి కాయలు కోత సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా అపార నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని, ఈ సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోతే నష్టపోవాల్సి వస్తుందని ఉద్యానవన శాఖ అనుముల క్లస్టర్ మురళి కొంపెల్లి హెచ్చరిస్తున్నారు. కాయలను సరైన పద్ధతిలో కోయకపోవడం, ముదిరిన కాయలతో పాటుగా, ముదరని కాయలను కోయడం, గ్రేడింగ్, ప్యాకింగ్‌లో సరైన ప్రమాణాలు పాటించకపోవడం, అపరిశుభ్రత, నిల్వ లోపాల వలన పండ్లు చెడిపోతాయి. సరైన యాజమాన్య పద్ధతులను అనుసరించటం వలన ఈ నష్టాలను తగ్గించుకోవచ్చు. నిల్వ, రవాణా సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక లాభాలు పొందవచ్చునని సూచిస్తున్నారు.

ఎంపికే కీలకం..

తోటల్లో కాయలను సరైన దశలోనే కోయాలి. కాయలకు భుజాలు ఏర్పడి, తొడిమ వద్ద గుంత ఉండాలి. శ్వేదగ్రంధులు కనిపిస్తుండాలి. కాయ ఆకుపచ్చ రంగు నుంచి బాగా ముదిరిన లేత ఆకుపచ్చ రంగు కలిగిన కాయలనే కోతకు ఎంపిక చేసుకోవాలి. వీటిలోనూ బ్రిక్స్(చక్కెర శాతం) ఉన్న కాయలనే కోయాలి. బ్రిక్స్ మీటర్ ద్వారా బ్రిక్స్ 10–13 ఉన్న కాయలను కోసుకోవాలి. రిఫ్రాక్టో మీటరును ఉపయోగించి కాయల పరిపక్వ దశను సులభంగా గుర్తించవచ్చు. ఇవి రవాణాకు అనుకూలంగా ఉంటాయి. లోపల కండ లేతపసుపు రంగులో ఉండాలి. కోత ఉదయం 10గంటల లోపు లేదంటే సాయంత్రం వేళల్లోనే ఉండాలి. పక్వానికి వచ్చిన కాయలను చిక్కాలను ఉపయోగించి నేలపై పడకుండా కోసుకోవాలి. కాయలకు గాయాలైతే మగ్గబెట్టిన సందర్భంలో శిలీంద్రాలు ఆశించి కుళ్లిపోయే ప్రమాదం ఉంది. కాయలకు 6 నుంచి 7సెంటీమీటర్ల తొడిమ ఉండేటట్లు చూసుకోవాలి. కాయల మీద ఉండే చర్మానికి సొన (జిగురు) అంటకుండా జాగ్రత్త తీసుకోవాలి. కాయ కోసిన తర్వాత తప్పనిసరిగా సొన(జిగురు) పూర్తిగా కారేలా చూడాలి. తర్వాత తొడిమలను 0.5 నుంచి 1 సెంటీమీటర్ వరకు ఉండేలా పదునైన కత్తితో కత్తిరించాలి. వాటిని తలకిందులుగా పెట్టి రెండుమూడు గంటలపాటు కదిలించకుండా ఉంచాలి. అప్పుడే కాయల నుంచి సొన సజావుగా నేల మీదికి కారుతుంది. కోతల సమయంలో కాయలపై చిన్న మచ్చగానీ, దెబ్బగానీ తగలకుండా జాగ్రత్త పడాలి. కోసిన కాయలను మట్టినేలపై ఉంచకూడదు.

ఇథిలిన్‌తో మాగించాలి

మామిడి కాయలను వ్యాపారులు కార్బైడ్ అనే రసాయనాన్ని ఉపయోగించి మాగిస్తున్నారు. దీనివలన కాయ మంచి రంగు వస్తుంది కాని రుచి ఉండదు. పైగా అనారోగ్యానికి కారణమవుతోంది. రైతులు, వ్యాపారులు కార్బైడ్‌తో కాకుండా ఆరోగ్యవంతమైన పద్ధతుల ద్వారా మాగించాలి. అప్పుడే రుచి, శుచి లభిస్తాయి. ఈ రెండు ఉంటే మంచి ధర లభిస్తుంది. ఇథిలిన్‌తో మామిడిని మాగించడం అన్ని విధాలా మంచిది. ఇథిలిన్ అనేది గ్రోత్ హార్మోన్. ఇది అన్నిచోట్ల లభ్యమవుతుంది. 10 లీటర్ల నీటికి ఒక మిల్లీలీటర్ ఇథిలిన్ కలిపిన ద్రావణంలో మామిడి కాయలను ముంచి నీడలో ఆరబెట్టిన తర్వాత గదిలో మామిడిని పోసి వరిగడ్డి కప్పితే 14 గంటల్లోనే మంచి రంగు, సువాసన వస్తుంది. ఇలా మామిడిని మాగించడం అన్ని విధాలా ఆరోగ్యదాయకం.

శుభ్ర పర్చడం చాలా అవసరం

మామిడి కాయలను శుభ్రపరచడం చాలా అవసరం, 10 గ్రాముల డిటర్జంట్‌ను 10లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో కడగాలి. తర్వాత 52 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడినీటిలో 200 పీపీఎం సోడియం హైపో క్లోరైడ్ కలిపి 2 నుంచి 3 నిమిషాల పాటు ఉంచాలి. రవాణా సమయంలో ఆంత్రాక్నోస్, పండు ఈగల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు కాయలను 48+0.3 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగిన నీటిలో గంట సేపు శుద్ధి చేయాలి. కాయలపై ఉన్న తేమ ఆరే వరకు నీడలో ఆరబెట్టాలి. 300–350 గ్రాముల బరువు ఉండేటట్లు గ్రేడింగ్ చేసుకుని, అట్టపెట్టెలలో 10 నుంచి 13 కాయలు అమర్చి ప్యాకింగ్ చేసుకోవాలి. ప్యాంకిగ్ కోసం టెలిస్కోపిక్ కార్గేటెడ్ ఫైబర్ బోర్డు బాక్సులను వాడాలి. వీటిని ఆరుగంటలలోపే ప్యాక్‌హౌజ్‌కు తరలించాలి. విదేశాలకు ఎగుమతి చేయాల్సిన పండ్లకు తప్పనిసరిగా ఇర్రాడియేషన్ చేయించాలి. ఒకసారి కోతకు ఉపయోగించిన పనిముట్లను మళ్లీ వాడాల్సి వస్తే వాటిని తప్పనిసరిగా శుభ్రం చేయాలి.

పురుగు మందులను పిచికారీ చేయరాదు

నిషేధించిన పురుగు మందులను కాయలపై పిచికారీ చేయకూడదు. వీలైనంత వరకు సేంద్రియ పురుగు మందులను మాత్రమే వాడాలి. కోత తరువాత వచ్చే తెగుళ్ల నివారణకు తోటలో ముందు నుంచే మంచి జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలి. కాయలు చిన్నసైజులో ఉన్నప్పుడు, తిరిగి కాయ కోతకు ముందు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా థయోఫానేట్ మిథైల్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. కాత దశలో మూడుసార్లు ఇలా పిచికారీ చేస్తే కాయలపై చీడల బెడద తగ్గుతుంది. కాయలు కుళ్లిపోకుండా ఉంటాయి.